గాలివాన బీభత్సం.. రైతన్నకు నష్టం

కోదాడరూరల్ : కోదాడ మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో రైతన్నలు ఆగమయ్యారు. వడగండ్ల వర్షంతో పాటు ఈదురు గాలులకు పంట పొలాల్లో ధాన్యం నేలరాలింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులపై పట్టాలు గాలికి లేచిపోయాయి. ఇక తమ్మర, తొగర్రాయి, గణపవరం, గుడిబండ గ్రామాల్లో రైతులు ఆరబెట్టుకున్న, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం రాశులు, కాంటాలు వేసిన ధాన్యం బస్తాలు వర్షానికి తడిశాయి. కాపుగల్లు, గుడిబండ, రెడ్లకుంట, గణపవర, నల్లబండగూడెంలో దాదాపుగా ఐదు వందల ఎకరాల్లో కోసేందుకు సిద్ధంగా ఉన్న మామిడి కాయలు పూర్తిగా రాలిపోయాయి. పలు చోట్ల చెట్లు కూడా వేర్లతో సహా నేలకొరిగాయి. దీంతో రైతులకు భారీ నష్టం వాటిల్లింది. ఇక రామలక్ష్మీపురం, హుజూర్‌నగర్, మేళ్లచెర్వు రోడ్డు నుంచి ఎర్రవరంకు వెళ్లే దారిలో చెట్లు కూలీ రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. మండలంలోని గుడిబండ గ్రామంలో 10 విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో ప్రజలు భయాందోళన చెందారు.


కోదాడరూరల్ : కాపుగల్లులో రాలిన మామిడికాయలను చూపుతున్న రైతు

కూలిన కొమ్మలు.. తొలగించిన యువకులు

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాలలో ఆదివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై భారీ వృక్షాల కొమ్మలు విరిగిపడడంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో స్థానిక యువకులు వేపూరి సుధీర్, శేషు, సాయి, ఫయాజ్, రమేష్, మోష తదితరులు కొమ్మలను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు.


మేళ్లచెరువు : ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిలిచిన వర్షపు నీరు

గాలికి ఎగిరిపోయిన పట్టాలు

చిలుకూరు : మండలంలో ఆదివారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ఐకేపీ కేంద్రాల వద్ద, రైతుల పొలాల్లో ఉన్న ధాన్యం తడిసింది. ఈదురుగాలులకు పట్టాలు ఎగిరిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట తీరా చేతికి వచ్చి అమ్ముకునే దశలో వర్షానికి తడిపోతుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

హుజూర్‌నగర్‌లో రైతుల అవస్థలు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో ఆదివారం గాలివాన బీభత్సం సృష్టించింది. పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీలోని గణేష్‌నగర్‌లో ఒక ప్రైవేటు స్కూల్ పైకప్పుగా వేసిన రేకులు లేచి వచ్చి పక్కనే ఉన్న ఇంటిపై పడ్డాయి. దీంతో వాటర్ ట్యాంక్ కూలి పాక్షికంగా నష్టం జరిగింది. పలుచోట్ల చెట్లు విరిగి విద్యుత్ స్తంభాలపై పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. విద్యుత్, మున్సిపల్, పోలీస్ సిబ్బంది తక్షణం స్పందించి చెట్ల కొమ్మలను తొలగించి విద్యుత్ పునరుద్ధరించారు. పట్టణ శివారులోని ఐకేపీ కేంద్రాలో ధాన్యం కొంతమేర తడిసింది. దీంతో ధాన్యం రాసులు, ధాన్యం బస్తాలపై పట్టాలు కప్పుకునేందుకు రైతులు నానా అవస్థలు పడ్డారు.

రేకు తగిలి మహిళకు గాయాలు

మేళ్లచెరువు : మండలంలో భారీ వర్షంతో ఐకేపీ కేంద్రంలో ధాన్యం తడిసింది. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రోడ్లపై నీరు నిలవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. కప్పలకుంటతండాలో బానోతు సోనా అనే మహిళ కల్లంలోని ధాన్యాన్ని దగ్గరకు చేర్చుతుండగా గాల్లో ఎగిరొచ్చిన రేకు ఆమె మెడకు, చెవికి తగిలి గాయాలపాలైంది. దీంతో ఆమెను చికిత్స నిమిత్తం హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.


కోదాడరూరల్ : ఎర్రవరానికి వెళ్లే రోడ్డుకు అడ్డంగా విరిగిపడిన చెట్లు


హుజూర్‌నగర్ : ధాన్యం రాశులపై నీరు నిల్వకుండా కాలువ తీస్తున్న రైతులు


హుజూర్‌నగర్ : ఈదురుగాలికి కోర్టు వద్ద కూలిన చెట్టు

వేపలసింగారంలో విరిగిపడిన ధ్వజస్తంభం


వేపలసింగారంలో ఈదురుగాలులకు విరిగిపడిన ధ్వజస్తంభం


మిట్టగూడెంలోని ధాన్యం గోడౌన్‌లో తడిసిన ధాన్యం బస్తాలు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలో ఆదివారం ఈదురుగాలులతో కూడిన వర్షం బీభత్సాన్ని సృష్టించింది. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి వేపలసింగారంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలోని ధ్వజస్తంభం విరిగిపడింది. మిట్టిగూడెంలో ఇరిగెల మోహన్‌రెడ్డికి చెందిన ధ్యానం గోడౌన్ రేకులు గాలికి లేచిపోవడంతో గ్రామానికి చెందిన ఆరుగురు రైతులు నిల్వచేసుకున్న సుమారు 3 వేల ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. గ్రామంలోని పలువురి ఇళ్ల రేకులు సైతం గాలికి ఎగిరిపడ్డాయి. ఒంటరిగా జీవిస్తున్న బుడిగె లక్ష్మమ్మ ఇంటి రేకులు లేచిపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉంది. ప్రభుత్వం తనను ఆదుకోవాలని ఆమె కోరారు. అలాగే గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు తడిసిపోయాయి.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి


కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

హుజూర్‌నగర్ : అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొప్పోజు సూర్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి కంబాల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్ పరిధిలోని ధాన్యం కొలుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షానికి మామిడి, నిమ్మతోటలతో పాటు ఐకేపీ కేంద్రాలలో ధాన్యం తడిసిందని, ఆ ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మామిడి, నిమ్మ రైతులను ప్రభుత్వ ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మన్యం పుల్లయ్య, బి.జయరాజు, అశోక్, రాంబాబు, సావిత్రి, త్రివేణి జానయ్య పాల్గొన్నారు.

25న బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

మఠంపల్లి : ఈనెల 25న బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండలంలోని అన్ని గ్రామాలలో ఘనంగా నిర్వహించి జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య కోరారు. ఆదివారం ఆయన స్థానికంగా జరిగిన ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామంలో పార్టీ జెండాలు ఆవిష్కరించాలన్నారు. అదే రోజు హుజూర్‌నగర్‌లో జరగనున్న బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధుల సభకు హాజరై విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు మన్నెం శ్రీనివాసరెడ్డి, కొండానాయక్, వెంకటనారాయణ, లక్ష్మీనరసింహరాజు, బ్రాహ్మారెడ్డి, హఫీజ్‌ఖాన్, నవీన్‌నాయక్, కోటానాయక్, నాగిరెడ్డి, భరత్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం : ఎమ్మెల్యే

హుజూర్‌నగర్ : క్రీడలతో శారీరిక, మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. రంజాన్ సందర్భంగా హుజూర్‌నగర్‌లో నిర్వహించిన క్రికెట్ పోటీలలో విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా యువకులతో కలిసి కాసేపు సరదాగా క్రికెట్ ఆడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అస్మానసీర్, నాయకులు గోపినాథ్‌రెడ్డి, ముస్లిం నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ..

పట్టణంలోని 24వ వార్డులో అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్ఎస్ నాయకుడు ఎన్.సుగ్రీవను ఎమ్మెల్యే సైదిరెడ్డి ఆదివారం పరామర్శించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

హుజూర్‌నగర్ : సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం అని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూ.9.95 లక్షల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ స్పెషల్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి సీఎం సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చన రవి, వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావు, కౌన్సిలర్లు, వార్డు అధ్యక్షులు, యువజన, మహిళ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సర్పంచ్ గుజ్జుల సుజాతను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని అమరవరంలో 2001– 2002వ విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తిచేసిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులంతా ఒకచోట కలిసి ఆప్యాయంగా పలకరించుకొని ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాటి గురువులను ఘనంగా సన్మానించారు. తదనంతరం పూర్వ విద్యార్థిని అయిన సర్పంచ్ గుజ్జుల సుజాతను శాలువ, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మరో ఇరవై ఏళ్లు అధికారంలో బీఆర్ఎస్

- ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

హుజూర్‌నగర్ : సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ మరో ఇరవై ఏళ్ల అధికారంలో ఉంటుందని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవంపై నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఎన్ని క్షుద్ర రాజకీయాలు చేసినా బీఆర్ఎస్ పార్టీని ఓడించలేరన్నారు. పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 25న స్థానిక కౌండిన్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే పార్టీ ప్లీనరీ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఓటుకు నోటు కేసులో దొరికిన వ్యక్తి నేడు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ సారధిగా ఉండటం ఆ పార్టీకే సిగ్గుచేటని విమర్శించారు. చేయి చేయి కలుపుదాం అంటూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చే నినాదం కాంగ్రెస్ పార్టీ వారికే నచ్చడం లేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, డి.పద్మ రాంరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ అర్చన రవి, వైస్ చైర్మన్ జె.నాగేశ్వరరావు, జెడ్పీటీసీ కె.సైదిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు హరిబాబు, ముడెం గోపిరెడ్డి, బసవయ్య, వై.పిచ్చయ్య, కౌన్సిలర్లు, వార్డు అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

బీజేపీ మండల అధ్యక్షుడు అందె కోటయ్య మృతి


అందె కోటయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


అందె కోటయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు గట్టు శ్రీకాంత్‌రెడ్డి


అందె కోటయ్య (ఫైల్)

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు గ్రామానికి చెందిన బీజేపీ మండల అధ్యక్షుడు అందె కోటయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. అందె కోటయ్య భార్య కమలమ్మ గతంలో పొనుగోడు గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. దీంతో కోటయ్య కాంగ్రెస్ పార్టీలో క్రియాశీల సభ్యుడిగా పనిచేసే సమయంలో అందరికి సుపరిచితుడు. ఆ తరువాత బీజేపీలో చేరి ప్రస్తుతం మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. కాగా కోటయ్య మరణవార్త తెలుసుకున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు గట్టు శ్రీకాంత్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యారెడ్డి, రామినేని కృష్ణయ్యలు.. కోటయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాత్రి అంత్యక్రియలు జరిగాయి. నివాళులర్పించిన వారిలో స్థానిక సర్పంచ్ జోగు సరోజనిపిచ్చిరెడ్డి, ఎంపీటీసీ మేళ్లచెరువు వెంకటరమణ, సైదులు, గుగులోతు కృష్ణానాయక్, జోగు అరవిందొరెడ్డి, రమేష్, లక్ష్మీనారాయణ లచ్చిరెడ్డి, శేఖర్‌రెడ్డి, సోమయ్య, యాకుబ్, పోకల వెంకటేశ్వర్లు, అంజన్‌రెడ్డి, పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాజకీయ రిజర్వేషన్ కోసం బీసీలు ఉద్యమించాలి

హుజూర్‌నగర్ : చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్ కోసం బీసీలు ఉద్యమించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ ధనుంజయనాయుడు కోరారు. ఆదివారం హుజూర్‌నగర్‌లో జరిగిన బీసీ సంక్షేమ సంఘం పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీసీ అభ్యర్థిని నిలబెట్టిన పార్టీనే బీసీలు మూకుమ్మడిగా బలపరచాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఆర్.వెంకటేశ్వర్లు, బి.గోవిందరావు, దూళిపాల శ్రీనివాస్, జె.శ్రీనివాస్, నరసింహచారి, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, కృష్ణ, వీరాచారి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందిస్తాం

నేరేడుచర్ల : నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్ అన్నారు. ఆదివారం స్థానిక మార్కెట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మార్కెట్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెట్‌లో పశువుల సంత పునరుద్ధరించేందుకు కృషి చేస్తానన్నారు. నేరేడుచర్ల, పాలకవీడు మండలాల్లో ధాన్యం వ్యాపారులు ట్రేడింగ్ లైసెన్స్‌లు తీసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. చిల్లేపల్లి వద్ద చెక్ పోస్టుకు నూతన గదిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నేరేడుచర్ల, పాలకవీడు మండలాల్లో ఉత్తమ రైతులను గుర్తించి వారికి ప్రభుత్వ ప్రోత్సాహంతో పాటు సన్మానిస్తామన్నారు. ఎమ్మెల్యే సైదిరెడ్డి సహకారంతో నాబార్డు నిధులతో ఐదు మెట్రిక్ టన్నుల గోదాంలను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని పేర్కొన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సోమగాని మురళి, కార్యదర్శి చినానాయక్, సభ్యులు బాలు, సైదిరెడ్డి, జ్యోతి, జయబాబు, పాపయ్య, రఫీక్, వినయ్‌కుమార్, సత్యనారాయణ, నాగార్జున, లక్ష్మీనారాయణ, సైదా, సూపర్‌వైజర్లు అనీల్‌కుమార్, ప్రతాప్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్

పేద కుటుంబానికి రూ. 4 లక్షల ఆర్థికసాయం

చిలుకూరు : చిలుకూరు గ్రామానికి చెందిన వల్లపుదాసు రామారావు ఈ నెల 13వ తేదీన తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి కింద పడి మృతి చెందారు. పేదరికంలో ఉన్న రామారావు కుటుంబాన్ని ఆదుకోవాలని సంకల్పించిన గ్రామస్తులు ఐక్యంగా వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. దీంతో చిలుకూరు గ్రామంతో పాటు హైదరాబాద్, ఆంధ్రా ప్రాంతానికి చెందిన పలువురు, ఇక్కడి ప్రాంతం వారి పరిచయాలతో అమెరికాలో ఉన్న పలువురు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగులు అందరూ కలిసి రామారావు కుటుంబానికి ఫోన్ పే ద్వారా తమకు చేతనైన సహాయం చేశారు. దీంతో వచ్చిన రూ. 4 లక్షలను ఆదివారం జరిగిన రామారావు దశదిన కార్యక్రమంలో వారి కుటుంబసభ్యులకు దాతలు అందజేశారు. ఈ సందర్భంగా రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


రామారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దాతలు

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

చిలుకూరు : మండల పరిధిలోని మిట్స్, అక్షర పాలిటెక్నిక్ కళాశాలల ఆవరణలో గల గురుకుల పాఠశాలలో ఆదివారం జరిగిన గురుకుల ప్రవేశ పరీక్షకు హాజరైన విద్యార్థులకు బహుజన పార్టీ ఆధ్వర్యంలో తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కందుకూరి ఉపేందర్, బొల్లెపంగు రాజేందర్, ముదిగొండ నాగయ్య, బొల్లెపంగు వేణు, నందు, సురేష్, చంటి పాల్గొన్నారు.


విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న బీఎస్పీ నాయకులు

ఘనంగా బసవేశ్వర జయంతి వేడుకలు


కోదాడరూరల్ : బసవేశ్వరుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ కవిత, తదితరులు


హుజూర్‌నగర్‌రూరల్ : బసవేశ్వర చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ గూడెపు శ్రీనివాస్

హుజూర్‌నగర్‌రూరల్ : మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మా బసవేశ్వర జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన చిత్రపటానికి ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ చంద్రకళ, ఆపరేటర్ ప్రసాద్, సిబ్బంది దుర్గయ్య పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో..

గరిడేపల్లి : మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం మహాత్మా శ్రీ బసవేశ్వర 890వ జయతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వనజ, ఎంపీటీసీ కడియం స్వప్నవెంకట్‌రెడ్డి, బల్గూరి సందీప్, పరమేష్, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక విప్లవకారుడు బసవేశ్వరుడు

కోదాడరూరల్ : సమాజంలో పేరుకుపోయిన వివక్షకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేసిన గొప్ప వ్యక్తి, సామాజిక ఆధ్యాత్మిక విప్లవకారుడు బసవేశ్వరుడని ఎంపీపీ చింత కవితారాధారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బసవేశ్వరుడి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దళిత, గిరిజన, బహుజన, మహిళల అభివృద్ధికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, సర్పంచ్ కాసాని వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ శంకరశెట్టి కోటేశ్వరరావు, గంటా శ్రీనివాసరావు, ఎండీ.సలీం, హసన్‌అలీ, వెంకన్న, సైదులు తదితరులు ఉన్నారు.


గరిడేపల్లి : మండల పరిషత్ కార్యాలయంలో..

బీజేపీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలి

నడిగూడెం : బీజేపీని గ్రామాల్లో బలోపేతం చేయాలని బీజేపీ కోదాడ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కనగాల నారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని తెల్లబెల్లి, చెన్నకేశవపురం గ్రామాల్లో బీజేపీ బూత్ లెవల్ కమిటీలో భాగంగా పని విభజన పట్టికలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వంగవీటి శ్రీనివాస్‌రావు, మేకల నాగరాజు, రౌతు జగన్, చల్లా శ్రీనివాస్, బడేటి నరేష్, గుంజ మహేష్, నాగమణి, శ్రీను పాల్గొన్నారు.

రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలి

కోదాడఅర్బన్ : సూర్యాపేటలో సోమ, మంగళ వారాల్లో జరిగే అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పోటు లక్ష్మయ్య కోరారు. ఆదివారం లాల్ బంగ్లాలో జరిగిన ఆ పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో దేశంలో, రాష్ట్రంలో రైతు కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి అనంతరం భవిష్యత్తు కార్యచరణ రూపొందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జాతీయ, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, ప్రజాతినిధులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'డబుల్' ఇళ్ల పంపిణీలో అవకతవకలు

చిలుకూరు : మండలంలోని బేతవోలు గ్రామంలో పంపిణీ చేసిన డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీలో అవకతవకలు జరిగాయని, ఇళ్ల పంపిణీపై తక్షణమే విచారణ చేపట్టి అనర్హులకు కేటాయించిన ఇళ్లను తొలగించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నారసాని వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇళ్ల పంపిణీలో అనర్హులు ఉన్నారని వారిని తొలగించి వారి స్థానంలో అర్హులకు కేటాయించాలన్నారు. ఇళ్ల పంపిణీపై జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేయనున్నట్లుగా పేర్కొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష


నడిగూడెంలో గురుకుల ప్రవేశ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నడిగూడెం : మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో ఆదివారం జరిగిన గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. అధికారులు విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించి పరీక్ష కేంద్రంలోకి పంపించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్ష కేంద్రాల వద్ద తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

చిలుకూరులో..

చిలుకూరు : మండల పరిధిలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల, అక్షర పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో గల గురుకుల పాఠశాలలో ఆదివారం జరిగిన గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్ష కేంద్రాల వద్ద తగు ఏర్పాట్లు చేశారు.

పద్మశాలి సంఘం పట్టణ కార్యవర్గం ఎన్నిక


పద్మశాలి సంఘం నూతన కమిటీ సభ్యులు

గరిడేపల్లి : మండల కేంద్రంలో పద్మశాలి సంఘం గరిడేపల్లి పట్టణ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా శ్రీరామ్ సీతారాములు, ఉపాధ్యక్షుడిగా మేక హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి బొట్ల రాములు, గౌరవ అధ్యక్షులుగా గుడా అంజయ్య, చెన్నా పాపయ్య, కోశాధికారిగా సూరేపల్లి ఏడుకొండలు, గుడా శ్రీనివాస్, నక్క భద్రగిరిలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో గుగ్గిళ్ల షరాబంధి, గుడా వెంకటేశ్వర్లు, చెరుకుపల్లి ఆంజనేయులు, రమేష్, సైదులు, జానకి రాములు, శ్రీరాం శ్రీనివాస్, శ్రీరాం బాల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌రెడ్డికి సన్మానం


శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న మిత్రులు

హుజూర్‌నగర్ : హైదరాబాద్‌లోని మీర్‌పేట మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా నియామకమైన హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డిని ఆయన మిత్రులు ఆదివారం హుజూర్‌నగర్‌లో శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో బాలకిరణ్, వల్లపుదాసు కృష్ణ., బెల్లంకొండ గురువయ్య, భాస్కర్, నరేంద్ర, శ్రీనివాసాచారి, గణేష్, కిషోర్, గౌతమ్‌రెడ్డి, నాగసైదులు, అరుణ్ తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

హుజూర్‌నగర్ : పట్టణంలోని 22వ వార్డులో మున్సిపల్ నిధులు రూ.5 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, సీసీ డ్రైన్, కల్వర్టు పనులను మున్సిపల్ చైర్ పర్సన్ గెల్లి అర్చన రవి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బాటసారుల దాహార్తి తీరుస్తున్న చలివేంద్రాలు

హుజూర్‌నగర్ : పట్టణంలోని పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని విద్యుత్ డీఈ శ్రీనివాసరావు, సీఐ రామలింగారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చలివేంద్రాలు వివిధ పనుల మీద వచ్చే బాటసారుల దాహార్తిని తీరుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

కోదాడరూరల్ : ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాలకు వరి, మామిడి, మొక్కజొన్న పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు లేక, కాంటాలు వేయక, వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించకపోవడంతో ధాన్యం తడిసిందన్నారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.40వేల నష్టపరిహారం చెల్లించాలని కోరారు.